
# మనవడికోసం

విన్నకోట సుశీలాదేవి




సుందరి చెయ్యి పట్టుకుని పరీక్షగా కిందికీ, పైకీ చూసి వదిలాడు స్వామీజీ!

"బాబా! సంతానయోగం వుందా?" ఆత్రంగా అడిగింది కామాక్షమ్మ!

నుదుటిమీద వున్న నామాన్ని వేళ్లతో రాసుకుంటూ ఆలోచనల్లో పడ్డాడు స్వామీజీ!

"ఏం చెప్తాడో?" అనుకుంటూ అతని ముఖంలోకి చూస్తున్నారు కామాక్షమ్మ, ఆమె కోడలు సుందరి, పక్కింటి సీత!

"అమ్మాయి చేతిలో సంతానరేఖ చాలా అడ్డదిడ్డంగా వుంది! శాంతి చేస్తేగానీ సంతానం కలగదు!" అన్నాడు.

సంతానం అసలు కలగదని చెప్తాడేమోనని హడలిపోతున్న కామాక్షమ్మకి ఆ మాట కాస్త శాంతి నిచ్చింది.

"శాంతి అంటే ఏం చెయ్యాలి? బాబా!" అడిగింది కామాక్షమ్మ.

"దంపతులు తీర్థయాత్రలు చెయ్యాలి నేనొక పూజ చెప్తాను, తిరిగొచ్చాక దాన్ని చెయ్యాలి!"

"బాబా! ఇవన్నీ చేస్తే పిల్లలు పుడ్తారంటారా?" సందేహంగా అడిగింది కామాక్షమ్మ.

ఆ మాటకి స్వామీజీ కళ్లెర్ర చేసి – "నా మాట మీద నమ్మకం లేదా?" అన్నాడు.

అది చూసి కామాక్షమ్మ కంగారుపడుతూ చెంపలు వాయించుకుంది.

"అయ్యో! అదేం కాదండీ! ఊరికే అడిగాను. మీరెంత గొప్పవారో నాకు తెలీదా!" అంటూ ఆయన్ని పొగిడి, పదిరూపాయలు ఆయన చేతిలో పెట్టింది.

ఆయన చేయవలసిన పూజా కార్యక్రమాన్ని వివరించాడు.

"ఇవన్నీ చెయ్యండి! సంతానం కలగకపోతే అప్పుడడగండి!" అని, సుందరిని దీవించి వెళ్లాడు.

"ఇలా ఎంతమంది చెప్పలేదు? వాళ్లు చెప్పినవన్నీ చేశాం! అయినా ఏం జరిగింది? నాకిటువంటి పూజల్లోనూ, వ్రతాల్లోనూ నమ్మకం పోతోందత్తయ్యా!" కుర్చీలో చారగిలబడి అంది సుందరి.

"అయ్యో! అలా అనకే అపచారం. ఈయన పెద్ద స్వామీజీ! హిమాలయాల్లో తపస్సు చేశాట్ట! ఈయన ఎలా చెప్తే అలా జరుగుతోందట! ఎన్నో దాఖలాలు కూడా వున్నాయి."

"ఏమో బాబా! ఇదంతా అనవసర ఖర్చు అనిపిస్తోంది."

"చాల్లే వూరుకో! ఇదేం పెద్ద ఖర్చా! రేపు మనవడు పుడ్తే, అంతా ఆదానే!" అంది ఆవిడ.

"నువ్వేమంటావు సీతా!" అంది సుందరి సీతవేపు చూస్తూ.

అప్పటివరకూ వారిద్దరి మాటలు వింటూ కూర్చున్న సీత సుందరి మాటకి,

"అత్తయ్యగారు చెప్పినట్లు చెయ్యవే! ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు?" అంది సీత.

ఆ మాటకి కామాక్షమ్మ సంతోషపడ్తూ – "అలా చెప్పవే సీతా!" అని,

"అప్పుడే మూడు దాటిందే సుందరీ! నాకిన్ని కాఫీనీళ్లు పోస్తివా సిద్ధాంతిగారి దగ్గరకు వెళ్లి ప్రయాణానికి ముహూర్తం పెట్టించుకొస్తా" అంది.

సీత లేచి "నేనూ వెళ్తాను సుందరీ! చిన్నాడు లేచాడేమో!" అని వెళ్లిపోయింది!

తనని తీర్థయాత్రలకు పంపేవరకూ అత్తగారికి నిద్రపట్టదు! అనుకుంటూ లేచి వంటింట్లోకి వెళ్లింది సుందరి!

సాయంత్రం ఆరయింది!

వెంకట్రావు ఆఫీసునుంచి వచ్చి, బట్టలు మార్చుకుని పేపరు పుచ్చుకుని కుర్చీలో కూర్చున్నాడు.

అప్పటివరకూ కోడలు దగ్గిర కూర్చుని తను విన్న పుణ్యక్షేత్రాల్ని గూర్చి వర్ణించి చెప్తున్న

కామాక్షమ్మ కొడుకుని చూసి, తనే కాఫీగ్లాసు పుచ్చుకుని అతని దగ్గరికెళ్ళింది!

కొడుక్కి గ్లాసు ఇచ్చి అతని ప్రక్కనే కూర్చుని మధ్యాహ్నం జరిగినదంతా వివరించి చెప్పింది.

"నేను సిద్ధాంతిగారిని అడిగానురా అబ్బాయి! వచ్చే శుక్రవారం ప్రయాణానికి చాలా బాగుంటుం దన్నాడు. శుక్రవారం అంటే సరిగ్గా రేపటికి వారమన్నమాట! ఈలోపు డబ్బు సిద్ధం చెయ్యి" అంది.

అసలే ఆఫీసులో పనిలో అలిసివచ్చిన వెంకట్రావుకి తల్లి ధోరణి విసుగు కలిగించింది

'ఈవిడ కింకేం పనిలేదు! ఎప్పుడూ వ్రతాలూ, శాంతులూ అని, నన్ను చంపేస్తోంది!' మనసులో విసుక్కున్నాడు.

కాని తల్లిమీద వుండే గౌరవంకొద్దీ పైకి ఏమీ అన్లేకపోయాడు.

ఆవిడ మనవడి కోసం పడే తాపత్రయం చూస్తుంటే ఒక్కొక్కప్పుడు జాలేస్తుంది! తనకీ పిల్లలంటే ఇష్టమే!

కాని దేనికైనా అదృష్టం వుండాలిగదా! వ్రతాలూ, పూజలూ చేస్తే పుడతారా! కాని తల్లి కదా పిచ్చి!

ప్రతి నెలలోనూ ఇటువంటి పూజా కార్యక్రమాలు కనీసం రెండైనా వుంటాయి. తన జీతంలో సగభాగం వీటికే ఖర్చవుతోంది! వెనకాల కొద్దిగ ఆస్థి వుండబట్టి, అప్పులు మాత్రం లేవు.

కాని ఇప్పుడు నెలాఖరు రోజులు!

ఈ పుణ్యతీర్థాలు సేవించుటకు ఎంత డబ్బవుతుందో? ఏమో!

"ఏమిట్రా? ఆలోచన?"

"మొన్ననేగా రెండొందలుపెట్టి అదేదో వ్రతం చేశావు! ఇప్పుడు మళ్ళీ అంటే..." నసుగుతూ అన్నాడు.

"అదేమిట్రా! అలా అంటే ఎలా? ఏది చేసినా పిల్లలకోసమేగా! నువ్వెక్కడో అక్కడ చూడాలి!" అంది కామాక్షమ్మ ఇక తప్పదన్నట్లు.

"ఎంతవుతుందో?"

"నేను వాకబు చేశాన్రా! ఒక వెయ్యి చాలుతుందిలే!" ఎంతో తేలిగ్గా అంది.

"వెయ్యి రూపాయలే!" గుడ్లు తేలవేశాడు వెంకట్రావు.

ఆవిడ అదేం పట్టించుకోకుండా – 'ఒరేయ్! నీ వేషాలు చాలుగానీ, వచ్చే శుక్రవారం మీరిద్దరూ బయలుదేరి వెళ్ళాలిందే! ఈలోపు డబ్బు ఎక్కడ తెస్తావో, ఎలా తెస్తావో, నాకు తెలీదు!" ఖచ్చితంగా అని, అక్కడినుంచి లేచి లోపలకెళ్ళింది కామాక్షమ్మ.

వెంకట్రావు నీరసంగా వెనక్కు వాలాడు!

నెలాఖరు రోజుల్లో డబ్బు అప్పు ఎవ్వడూ ఇవ్వడు.

అమ్మ మాటకు తిరుగులేదు. తాము తీర్థయాత్రలకు ఎలా...?

ఆలోచించి, ఆలోచించి చివరికి ఆఫీసులో లోను తీసుకోవడానికి నిశ్చయించుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి!

కామాక్షమ్మ తీర్థయాత్రలకు కావల్సిన ఏర్పాట్లన్నీ దగ్గరుండి చూస్తోంది!

సుందరి ప్రయాణం గూర్చి ఆ వీధిలో అందరికీ తెలిసిపోయింది!

రోజూ వచ్చి తమకు తెలిసిన పుణ్యక్షేత్రాలను గూర్చి అత్తాకోడళ్లకు చెప్పడం మొదలెట్టారు.

ప్రయాణం 'రేపు'లోకి వచ్చింది.

ఆ మధ్యాహ్నం భోజనాలయ్యాక సుందరి సీత దగ్గరికి వెళ్ళింది.

సుందరి వెళ్ళేసరికి సీత దిగాలుగా కూర్చుని వుంది. సీత కొడుకు నాలుగేళ్ల రాముం మంచం మీద పడుకుని వున్నాడు.

సుందరిని చూసి,

"రా! సుందరీ!" అంది సీత మెల్లగా.

"రామూ అలా పడుకున్నాడే సీతా! ఏమయింది?" సుందరి ఆత్రంగా అడిగింది

"ఏం చెప్పను సుందరీ! వారం రోజులనుండీ రామూ కడుపునొప్పి అంటుంటే, అజీర్తి అనుకుని ఏదో నాటువైద్యం చేశాను. కానీ తగ్గలేదు! నిన్న డాక్టరు దగ్గరికి తీసికెడితే పరీక్షచేసి కడుపులో ఏదో కంతిలా లేచిందని త్వరగా ఆపరేషను చెయ్యకపోతే కుర్రాడు దక్కడని చెప్పాడు. ఆపరేషన్‌కి ఎంతలేదన్నా అయిదొందలన్నా కావాలి! మా స్థితి నీకు తెలుసుకదే! అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తాం! అక్కడికీ ఆయన ఏదో తంటాలు పడుతూనేవున్నారు. ఆపైన మా అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుంది!" సీత చెంపలు నీటితో తడిసిపోయాయి.

సుందరికి దుఃఖం వచ్చింది.

నిన్నటిల్లా రామూ కన్పించని కారణం ఇదన్న మాట! అంటూ రాము వేపు చూసింది.

ఎప్పుడూ వుషారుగా గంతులు వేస్తూ తిరిగే రామూ అలా పడుకుని వుంటే కడుపులో దేవి నట్లయింది.

రామూ అంటే సుందరికి చాలా ఇష్టం! రామూ పుట్టింది సీతకే అయినా చిన్నప్పట్నించీ ఎక్కువ సమయం సుందరి దగ్గిరే వుండేవాడు.

వాడికి సుందరే నీళ్ళు పోసేది, అన్నం పెట్టేది! రాత్రిళ్ళు కూడా తన దగ్గిరే పడుకో బెట్టుకునేది. అప్పుడప్పుడు ఎవ్వరూ వినకుండా వాడిచేత'అమ్మా'అని పిలిపించుకుని సంతోషిస్తూ వుండేది.

ఒక విధంగా చెప్పాలంటే సుందరికి పిల్లలు లేనిలోటు తీర్చి ఆమెని ఆనందపెట్టేది రామూనే!

అటువంటి రామూకి ఇంత భయంకరమైన వ్యాధా! వెంటనే ఆపరేషన్ చెయ్యకపోతే ప్రమాదంట!

అంటే రామూ చనిపోతాడా!

సుందరి గుండె దడదడ లాడింది.

ఇక అక్కడ వుండలేక ఇంటికొచ్చేసింది. మాటి మాటికీ రామూనే కళ్లల్లో మెదుల్తున్నాడు. రామూ చావకూడదు! ఎలాగైనా వాడిని రక్షించాలి.

కాని ఎలా?

ఆలోచించి చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది! గబగబా లేచి సీత దగ్గిరికి వెళ్ళింది.

సుందరి చేతిలోని డబ్బు చూసి తెల్లబోతూ,

"ఏంటిది!" అంది సీత.

"డబ్బు! వెయ్యి రూపాయలు!! తీసుకో!"

సీతకి నోటమాట రాలేదు.

"తీసుకో!" అంటూ సుందరి వాటిని సీత చేతిలో పెట్టింది.

"మరి మీ ప్రయాణం!" అంది సీత ఎలాగో నోరు పెగల్చుకుని.

"మేము వెళ్లటం లేదు!" తాపీగా అంది సుందరి.

"కాని ..."

"సీతా! అనవసర ప్రశ్నలతో కాలయాపన



'శ్రీ లక్ష్మినిలయం'లో టి. రాజేశ్వరి, గోకిన రామారావు

## చమురు కొరతను కాదనే ఎలక్ట్రిక్ మోటారుకారు

గల్ఫ్, వెస్టన్ ఇండస్ట్రీస్ అనే ఒక అమెరికన్ పారిశ్రామిక సంస్థ ఒక ఎలక్ట్రిక్ బ్యాటరీని తయారుచేసింది. దీనితో గంటకు 55 మైళ్ల వేగంతో 150 మైళ్లు ఒక కారు నడిపారు. దీనికోసం బ్యాటరీని ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు చార్జి చేయ వలసి వచ్చింది.

జింక్ – క్లోరైడ్‌తో ఈ బ్యాటరీ నిర్మాణం జరిగింది. వీటి నిర్మాణం పక్కాగా పూర్తయినప్పుడు 2000వ సంవత్సరం లోగా అమెరికా 10 లక్షల పీపాల చమురు పొదుపు చేసుకోగలదని భావిస్తున్నారు.

ఈ కొత్త ఎలక్ట్రిక్ బ్యాటరీని జపాన్‌లో తయారైన ఒక వ్యానుకీ, వోల్క్స్‌వాజన్ రాబిట్ అనే ఒక వాహనానికీ అమర్చి పరీక్షించారు. అయితే, మామూలు కారుకు అమర్చినట్లయితే, ఇది ఇంకా బాగా పని చేయగలదట. ఈ బ్యాటరీ తయారీకి 1 కోటి 60 లక్షల డాలర్లు ఖర్చయింది.

ఈ బ్యాటరీని చార్జి చేయటానికయ్యే ఇంధన వ్యయం ఆయా రాష్ట్రాలలో కరెంటు చార్జీలనుబట్టి ఉంటుంది. అమెరికాలో కరెంటు చార్జీ సగటున కిలోవాట్‌కి 5 సెంట్లు ఉంటుంది. వోల్క్స్‌వాజన్ రాబిట్ అనే వాహనంలో నలుగురు చొప్పున – కిలోవాట్‌కి 5 సెంట్లు లెక్కన 240 కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లయితే పెట్రోలు ధరకు సమానంగా ఖర్చు అవుతుంది. (ప్రస్తుతం అమెరికాలో పెట్రోలు ధర గ్యాలన్ 1.25 డాలరు చొప్పున ఉన్నది.)

ఈ బ్యాటరీ నిర్మాణం ఈ శతాబ్దిలో ఒక ముఖ్యమైన పరిణామం అనాలి.

## మనవడికోసం

చెయ్యకు! రామూకి ఏదన్నా అయితే ఆ తర్వాత ఎన్ననుకున్నా లాభం లేదు!''

ఆ మాటతో సీత కాస్త జంకింది.

''సుందరీ! మీ అత్తగారికి చెప్పావా?''

''లేదు! అవన్నీ నేను చూసుకుంటాను. ముందు రామూకి ఆపరేషన్ చేయించు!''

మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా వెళ్లిపోయింది సుందరి.

మర్నాడు పొద్దున వెంకట్రావు పేపరు చదువుకుంటుంటే అతని దగ్గిరికెళ్లి –

''ఏవండీ! ఇవ్వాళ మన ప్రయాణంలేదు!'' అంది సుందరి.

వెంకట్రావు హాయిగా వూపిరి పీల్చాడు.

''ఉఁ... సరే!'' అన్నాడు పేపరు లోంచి తలెత్తకుండానే.

''మరీ మీరిచ్చిన వెయ్యి రూపాయలు సీతకిచ్చాను!'' అంటూ జరిగిన విషయం చెప్పింది.

''సరే ... సరే!'' అన్నాడు వెంకట్రావు.

ఇంటి విషయాల్లో జోక్యం చేసుకోవటం అతనికి మొదటి నుంచీ అలవాటులేదు.

తల్లి, భార్య చెప్పిన మాటలకల్లా తలూపుతుంటాడు.

సుందరి చెప్పిన విషయాన్నిగూర్చి పెద్దగా పట్టించుకోలేదు. 'సరే' అని వూరుకున్నాడు.

కాని వంటింట్లో కూర్చుని కూరలు తరుగుతున్న కామాక్షమ్మ ఆ మాటలు విని చరచరా కోడలు దగ్గిరికొచ్చింది.

''ఏవిటే! వెయ్యి రూపాయలు దానికిచ్చావా! నాకు చెప్పకుండానే! ఎంత ధైర్యమే నీకు! ఇవ్వాళ ప్రయాణం ఎలాగనుకున్నావు?''

''అదికాదత్తయ్యా!'' అంటూ రామూ పరిస్థితి చెప్పబోయింది... కాని ఆవిడ విన్పించుకోలేదు.

ఈ రగడ చూసి వెంకట్రావు ఆశ్చర్యపోయాడు. ఇప్పటివరకూ ఈ విషయం తల్లికి కూడా తెలుసనుకున్నాడు. కాని తల్లికి చెప్పకుండా సుందరి ఇచ్చిందని తెలిసేసరికి ఇక అక్కడ వుండలేకపోయాడు.

ఇటు భార్య, అటు తల్లి ఎవరికి చెప్పగలడు! అందుకే అక్కడినుంచి లేచి నెమ్మదిగా లోపలికి జారుకున్నాడు.

కామాక్షమ్మ సుందరిని ఇంకా తిట్టిపోస్తూనే వుంది.

''ఏదో వందా, యాభై ఇచ్చుకుంటారుగానీ, వెయ్యి రూపాయలు తీసికెళ్లి దాని చేతిలో పోస్తావా! అందునా ఇవ్వాళ ప్రయాణం పెట్టుకుని! బుద్ధుల్నిబట్టే రాతలుంటాయిట! ఇటువంటి దరిద్రపు బుద్ధులుండబట్టే మా ఖర్మ ఇలా కాలింది!''

అత్తగారి తిట్లు ఒకవైపు దుఃఖాన్ని, ఒకవైపు కోపాన్ని కలిగిస్తున్నా అన్నీ భరించి తన పని తను చేసుకోసాగింది సుందరి.

పది రోజులు గడిచాయి!

ఒక మనిషిని మాటలతో ఎంత చిత్రహింస పెట్టవచ్చో ఈ పదిరోజుల్లో అనుభవపూర్వకంగా తెలుసుకుంది సుందరి.

రోజూ ఇంటికి ఎవరో ఒకరు వచ్చేవారు!

వాళ్ల దగ్గిర కామాక్షమ్మ సుందరిని తిట్టిపోసేది, వాళ్లు కామాక్షమ్మని ఓదార్చేవారు! రోజూ ఇదో పార్సు అయిపోయింది!

''దానికసలు పిల్లలంటేనే ఇష్టంలేదొదినా! ఎవరన్నా వుంటారా ఇలా? మా కర్మకొద్దీ మాకు దాపురించింది! ఏ జన్మలో చేసుకున్న పాపమో కానీ, మనవడిని ఎత్తుకునే అదృష్టం లేదు నాకు'' కామాక్షమ్మ కళ్లొత్తుకుంటూ అనేది.

అవతలి వాళ్లు – ''నువ్వు కాబట్టి ఇన్ని కష్టాల్ని భరిస్తున్నావు! ఇదే ఇంకో అత్తయితే ఈపాటికి కోడల్ని తరిమేసి కొడుక్కి మళ్లీపెళ్లి చేసేది. ఏం చేస్తాం! నువ్వు మంచి దానివి కాబట్టి సరిపోయింది. ఊరుకో!'' అంటూ ఓదార్చేవారు.

ఈ మాటలు విని, విని సుందరి మనస్సు తూట్లు పడింది.

రామూ ఆరోగ్యంగా తిరిగొచ్చాడు. అదే సుందరికి కాస్త శాంతినిచ్చింది. వాడితో కాస్సేపు కబుర్లు చెప్పి ఆనందపడదామన్నా కామాక్షమ్మ రామూని గుమ్మం ఎక్కనివ్వటం లేదు.

ఇంట్లో నరకం రోజురోజుకీ ఎక్కువవుతోంది.

సుందరి భరించలేకుండా వుంది.

రోజూ ఇరుగు పొరుగు వాళ్ల మాటలు, అత్తగారి సాధింపులు వింటూ కాస్త, కాస్త చచ్చేకన్నా ఒకేసారి చస్తే తనకీ హాయి! వాళ్లకీ తన అడ్డు తొలగిపోతుంది.

ఒకరోజు బజారుకెళ్లి నిద్రమాత్రలు తెచ్చుకుని వేసుకుంది.

''వచ్చే జన్మంటూ వుంటే ఆడదానిగా మాత్రం పుట్టించకు భగవంతుడా!'' అని దేవుడిని ప్రార్థిస్తూ కళ్ళు మూసుకుంది.

మళ్లీ సుందరి కళ్ళు తెరిచేసరికి ఎదురుగా అత్తగారు కన్పించింది! ఆవిడని చూసి సుందరి ఆశ్చర్యపోయింది!

''ఇదేమిటి? తను చావలేదా! తనకాదృష్టం కూడా లేదా!'' అనుకుని నీరసంగా కళ్ళు మూసుకోబోతున్న సుందరిని చూసి —

''ఎంత అఘాయిత్యం చేశావే తల్లీ! ఇంకో రెండు మాత్రలు ఎక్కువ మింగివుంటే ఏమయ్యేది? పెద్దదాన్ని ఏదో నా బాధకొద్దీ అన్నానే అనుకో! అంతలోనే ఇలా చెయ్యాలా! నువ్వు మళ్లీ కళ్ళు తెరిచేవరకూ నా మనసు మనసులో లేదనుకో! ఆ ఏడుకొండలవాడి దయవల్ల ఆపద గట్టెక్కింది! నా మాటలేవీ మనసులో పెట్టుకోకే సుందరీ!'' అంటూ సుందరి చెయ్యి పుచ్చుకుంది కామాక్షమ్మ.

సుందరి అత్తగారివేపు అయోమయంగా చూసింది.

''సుందరీ ఇంకో శుభవార్త విన్నావా! డాక్టరమ్మ చెప్పింది, నీకు మూడో నెలట!'' అంది సంబరపడుతూ.

సుందరికిది కలో, నిజమో తెలియనంత ఆశ్చర్యం కలిగింది!